క్లుప్తంగా

పెదయాగనమిల్లిలో డ్రెయినేజీ పరిశీలన



గుడివాకలంకలో కొత్తగా నిర్మించిన డ్రెయినేజీ పరిశీలిస్తున్న ఎంపీపీ

ఏలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో కొల్లేరు గ్రామాలు 90 శాతం అభివృద్ధి సాధించాయని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం ఆయన పెదయాగనమిల్లిలో డ్రెయినేజీ అభివృద్ధి పనులు పరిశీలించారు. టీడీపీ హయాంలో కొల్లేరు గ్రామాల్లో మురుగునీరు బయటకు పోయేది కాదన్నారు. వర్షాలు, వరదలకు ఊళ్లన్నీ రోజుల తరబడి మురుగునీటిలో నిండిపోయేవని గుర్తుచేశారు. నేడు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో కొల్లేరు గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు దీన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో పనిచేసే ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నెరుసు నాగసత్యంకు సన్మానం



నెరుసు నాగసత్యంను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానాల ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన నెరుసు నాగ సత్యంను స్థానిక లక్ష్మీవారపుపేటలోని ఏఆర్‌డీజీకే స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నాగసత్యం ఏఆర్‌డీజీకే స్కూల్‌లో 1989, 90 సంవత్సరాల్లో విద్యాభ్యాసం చేశారు. తమ మిత్రుడు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాగసత్యంను పూలమాలతో, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఎండీ అక్బర్, గొంతిన రామకృష్ణ, పి.వెంకటేశ్వర రావు, ఎండీ హుస్సేన్, మక్కా శ్రీను, కె.రాజేష్, వీరంకి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- నాలుగేళ్లలో రూ.30 కోట్ల పనులు
- 80 శాతం సీసీ రోడ్డుగా అభివృద్ధి



శ్రీపర్రు గురుకులపేట మధ్య సీసీ రోడ్డుగా మారిన ప్రధానరోడ్డు



గుడివాకలంక బీసీ కాలనీలో సీసీ రోడ్డుగా మారిన గ్రావెల్ రోడ్డు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో రోడ్లకు మహర్దశ ఏర్పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధికి మండల పరిషత్, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్, రూర్బన్, ఎమ్మెల్యే స్పెషల్ ఫండ్స్, ఆర్‌అండ్‌బీ నుంచి రూ.30 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 35 కిలో మీటర్ల విస్తీర్ణంలో రోడ్లు నిర్మించారు. మట్టిరోడ్లను గ్రావెల్‌రోడ్లుగా, గ్రావెల్ రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశారు.

రూ.20 కోట్ల ఉపాధి నిధులు

రోడ్ల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులు ఎంతో ఉపయోగపడ్డాయి. 15 గ్రామాల్లో 14 వేల మంది ఉపాధి కూలీలు చేస్తున్న పని దినాలు వల్ల మండల పరిషత్‌కు పెద్దఎత్తున మెటీరియల్ నిధులు వచ్చి చేరాయి. ఏడాదికి సుమారు రూ.9 కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.34 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ చేరాయి. ఇందులో సుమారు రూ.20 కోట్లు సీసీరోడ్ల అభివృద్ధికి వెచ్చించారు. మాదేపల్లిలో రూ.2 కోట్లు, గుడివాకలంకలో రూ.80 లక్షలు, కోమటిలంకలో రూ.40 లక్షలు, మల్కాపురంలో రూ.60 లక్షలు, ప్రత్తికోళ్లలంకలో రూ.1.40 లక్షలు, పైడిచింతపాడు రూ.60 లక్షలతో పాటు పలు గ్రామాల్లో సుమారు 10 కిలో మీటర్ల సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. దీనికి తోడు ఆర్‌అండ్‌బీ శాఖ శ్రీపర్రు, మాదేపల్లి, కొక్కిరాయిలంక వద్ద ప్రధాన రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసింది.

రూర్బన్ నిధులతో కొత్త పనులు

ఏలూరు నగర పరిసర గ్రామాల్లో అర్బన్ స్థాయి మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన రూర్బన్ పథకం ఏలూరు మండల గ్రామాలకు కలిసి వచ్చింది. కొద్దిరోజుల క్రితం అధికారులు రూ.4 కోట్ల రూర్బన్ నిధులతో మరిన్ని సీసీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టెండర్లు సైతం పిలిచి పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ప్రత్తికోళ్లలంక గ్రామానికి రూ.22.12 లక్షలు, పైడిచింతపాడు రూ.17.99 లక్షలు, కోటేశ్వరదుర్గాపురం రూ.55.44 లక్షలు, గుడివాకలంక రూ.31.22 లక్షలు, మొండికోడు రూ.32.73 లక్షలు, చాటపర్రు రూ.75.04 లక్షలు, జాలిపూడి రూ.34.23 లక్షలు, మాదేపల్లి రూ.44.80, మల్కాపురం రూ.33. 25 లక్షలు, శ్రీపర్రు రూ.53.18 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో గ్రామాల్లో మరిన్ని సీసీ రోడ్లు అభివృద్ధి చేయనున్నారు.

ఉపాధి పనులతో అభివృద్ధి



ఉపాధి హామీ పథకం నిధులు గ్రామాల అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రత్యేక ప్రణాళికతో ఉపాధి పనులు నిర్వహించాం. దీనికితోడు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. ఫలితంగా పెద్ద ఎత్తున నిధులు వచ్చాయి. వీటితో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన గ్రామాలను అభివృద్ధి బాట పట్టించారు.

– ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు

మెటీరియల్ నిధులు రూ.57 లక్షలు



గతేడాది చేపట్టిన ఉపాధి పనులు కారణంగా నేటికీ రూ.57 లక్షల మెటీరియల్ పేమెంట్ అందుబాటులో ఉంది. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. గతేడాది రూ.19 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఫలితం రాబట్టాం. 2023–24 సైతం రూ.37.90 కోట్లతో బడ్జెట్ రూపొందించాం. ఇందులో కూలీలకు వేతనాల రూపంలో రూ.22.74 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.15.16 కోట్లు కేటాయించాం.

– కిషోర్, ఏపీఓ

8న ఆశా వర్కర్ల ఆందోళన

ఏలూరు (టూటౌన్): హర్యానా రాష్ట్రంలో ఆగస్టు 8 నుంచి ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఈనెల 5న ఆందోళన చేస్తామని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కమల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో పోశమ్మ మాట్లాడారు. హర్యానాలో ఆశావర్కర్లు సమస్యల పరిష్కారం కోరుతూ గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులను లాఠీ చార్జీ చేసి అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలైన ఆశావర్కర్లు పట్ల హర్యానా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన ఆశా వర్కర్లకు కనీసం మంచినీరు ఇవ్వకుండా టాయ్‌లెట్ సౌకర్యం కల్పించకుండా హింసించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా హర్యానా ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు రోజా, నాగమణి, కామేశ్వరి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : రాట్నాలమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన మహిమగల తల్లి శ్రీ రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టిక్కెట్ల ద్వారా రూ.43,760, విరాళాల ద్వారా రూ.25,007, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.34,840, ఫొటోల ద్వారా రూ.4,830 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేళంగిణిమాత ఉత్సవాలు



వేళంగిణి చర్చిలో ఉత్సవాలు

దెందులూరు: మండలంలోని వేగవరం గ్రామంలో ఆర్‌సీఎం చర్చిలో స్థానిక ఫారీస్ క్రిస్ట్ ఫాదర్ మోజెస్ అధ్యక్షతన వేళంగిణిమాత ఉత్సవాలు నవదిన పూజ చేశారు. వేగవరం, మసీదుపాడు, గోపన్నపాలెం, చల్లపల్లి సంఘస్తులకు ఫాదర్ ఆర్.బాలస్వామికి నిర్వాహకులు ఫాదర్ మోజెస్ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత దివ్యపూజాబలి అర్పించారు. సంఘస్తులు ఫాదర్లను సత్కరించారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

దెందులూరు: నేటి నుంచి 8వ తేదీ వరకు మండల స్థాయిలో, 12 నుంచి 16 వరకు నియోజకవర్గ స్థాయిలో అండర్–14, –17 విభాగాల్లో బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.కృష్ణారావు తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిడ్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామని, పూర్తి వివరాలకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఫోన్ నెంబర్ 97011 77004లో సంప్రదించాలని కృష్ణారావు కోరారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం



జంగా గోపాల్‌ను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

ఏలూరు (టూటౌన్): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. స్థానిక అశోక్ నగర్ ద్వారక గార్డెన్స్‌లో ఆదివారం వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం విద్యావేత్త, వినియోగదారుల ఉద్యమ నాయకుడు జంగా గోపాల్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ జంగా గోపాల్ వినియోగదారుల ఉద్యమానికి చేసిన కృషిని కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మరింతగా పనిచేయాలన్నారు. ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం బలహీనంగా ఉందని, మండలాలు, గ్రామాల్లో వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవా మండలి అధ్యక్షుడు, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలు విడిపోయిన తర్వాత ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం బలహీనంగా ఉందన్నారు. ఉద్యమం మరింత ముందుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వినియోగదారుల చట్టం 2019పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జంగా గోపాల్‌ను దుశ్శాలువా కప్పి పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తణుకు వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎస్‌ఆర్ శంకర్, చింతలపూడి అధ్యక్షుడు మొహిద్దీన్, ఎల్డర్స్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పుష్పాంజలి, జంగా గోపాలరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

ఏలూరు (టూటౌన్): యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి విమర్శించారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన దేశంలో నిరుద్యోగ సమస్య – ప్రభుత్వాల వైఖరి అనే అంశంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. రైల్వే, టెలికాం, బ్యాంకింగ్, బీమా వంటి ప్రభుత్వ రంగ సంస్థలనూ ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల దేశంలో కోట్లలో ఉద్యోగాలు ఖాళీలు ఏర్పడ్డాయని వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఏలూరు జూట్ మిల్లు, భీమడోలు షుగర్ ఫ్యాక్టరీల మూసివేతను గుర్తుచేశారు. రాజనాల రామ్మోహన్‌రావు (కాంగ్రెస్), షేక్ మస్తాన్ (ఆప్), గుబ్బల నాగేశ్వరరావు (భారత్ బచావో), డీఎన్‌వీడీ ప్రసాద్ (సీఐటీయూ) తదితరులు మాట్లాడారు. జి.సూర్యకిరణ్ (డీవైఎఫ్ఐ), కె.లెనిన్ (ఎస్ఎఫ్ఐ), క్రాంతి (పీడీఎస్‌యూ), కె.శ్రీనివాస్ (ఏపీ రైతు సంఘం), పి.ఆదిశేషు (చేతివృత్తిదారుల సంఘం) తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ షాపు లీజుకు 16న వేలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేవదాయ శాఖ పరిధిలో ఉన్న నగరంలో అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి చెందిన స్థానిక కత్తేపువీధిలోని షాపు లీజుకు ఈ నెల 16న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్నవారు రూ.5 వేలు ధరావతు చెల్లించి స్థానిక వన్‌టౌన్‌లోని అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజ కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు



దిశ డీఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కట్లయ్య తదితరులు

ఏలూరు (టూటౌన్): మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏలూరు దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ఆధ్వర్యంలో దిశ డీఎస్పీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు, ఏలూరు సత్రంపాడుకు చెందిన యువతి భార్యాభర్తలు. వీరి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా దిశ పోలీస్‌లను ఆశ్రయించారు. డీఎస్పీ భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. వివిధ సమస్యలతో దిశ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే వారికి పరిష్కారం నిమిత్తం కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. అప్పటికీ వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన డీఎస్పీకి మురళీకృష్ణకు కట్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రజక యూత్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు పున్నపు నరసింహారావు, కడిలి సుబ్బయ్య, కొమ్మంటి మురళీధర్, అన్నవరం, జంగారెడ్డిగూడెం శ్రీనివాస్, ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	17
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	14
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	24	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	05–08
బెండకాయలు	24	కంద	46
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	32–36	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	76
క్యాబేజీ	28	అల్లం	120–220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	20–32	పుదీనా	05
ఆనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	12–18

తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు



త్రీటౌన్ స్టేషన్‌లో బాలుడ్ని తండ్రికి అప్పగించిన సీఐ శివాజీ

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి చర్చికి వచ్చిన బాలుడు బయటకొచ్చి తప్పిపోయాడు. చర్చిలో సండేస్కూల్ జరుగుతుండగా ఆడుకుంటూ బయటకు వచ్చిన చిన్నారి రోడ్డుపైకి వచ్చి ఎటెళ్లాలో తెలియక తప్పిపోయాడు. ఒంటరిగా రోడ్డుపై తిరుగుతున్న బాలుడ్ని గుర్తించిన వినోద్‌కుమార్ అనే వ్యక్తి త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీస్ అధికారులకు అప్పగించాడు. బాలుడు కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన డేవిడ్‌గా పోలీసులు గుర్తించారు. ఆగడాలలంకలో ఒక స్కూల్లో చదువుతున్నట్టు తెలుసుకున్నారు. సీఐ కోమాకుల శివాజీ బాలుడి తండ్రి అశోక్‌ను త్రీటౌన్ స్టేషన్‌కు పిలిపించి డేవిడ్‌ను అప్పగించారు. బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చిన వినోద్‌కుమార్‌ను పోలీసులు, డేవిడ్ తండ్రి అభినందించారు.

దెందులూరులో రోడ్లు మంజూరు

దెందులూరు: దెందులూరు గొడవీధిలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ రెండు రోడ్లు మంజూరు చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. ఆదివారం దెందులూరు గొడవీధిలోని కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ గొడవీధిలో గత కొన్నేళ్లుగా నడకకు తీవ్రంగా ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పద్మశ్రీ ప్రసాద్‌లకు వైఎస్సార్‌సీపీ గొడసంఘం దెందులూరు గ్రామం తరపున ఏసుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

రామాంజనేయులు మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు మృతి చేనేత రంగానికి, ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు సంతాపం వ్యక్తం చేశారు. రామాంజనేయులు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యానికి కృషి



శ్రీహరికోటి దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు భాషా ఔన్నత్యం కోసం శ్రీశ్రీ కళా వేదిక నిరంతరం కృషి చేస్తోందని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత నెల 27న శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఏలూరులో విజయవంతమైన సందర్భంగా ఆదివారం ఏలూరులోని ఫ్లాష్ కదలిక కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్, అంతర్జాతీయ సమన్వయ కర్త కొల్లి రమావతి, ఫ్లాష్ సంస్థ ప్రతినిధి వెంకట రాంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. కవి సమ్మేళనం విజయవంతమవ్వడానికి సహకరించిన ప్రముఖులను ఏలూరు జిల్లా కార్యవర్గం అధ్యక్షుడు శ్రీహరికోటి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారథి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీహరి కోటి మాట్లాడుతూ శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్, అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన వారిని మహిళా అధ్యక్షురాలు శ్యామలా హరికోటి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక గౌరవ సలహాదారులు లేళ్ల వెంకటేశ్వరరావు, ఈమని శేషయ్య, జిల్లా కన్వీనర్ జి.కృష్ణ మనోహర్, కో కన్వీనర్ ఎంజీ సుజయ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మానుకొండ చిన్నయ్య, మహిళా ప్రధాన కార్యదర్శి అనూరాధ పురం, కార్యదర్శులు ఎంఎన్వీ ప్రసాద్, దారామోహనరావు, ఎస్‌కేడీ ప్రసాద్, శిఖా ఆకాష్, గోరింక ఐజక్, యూత్ విభాగం కార్యదర్శులు పురం శ్రీరంగ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

భీమడోలు: ఓ వివాహితను వేధిస్తోన్న ఓ వ్యక్తిపై పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. భీమడోలు మండలం దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెంకు చెందిన వివాహితను ఆమె ఇంటి ఎదురుగా ఉన్న పి. కొండ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పెదవేగి : పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ.3,110 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు.

యువకుడికి గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై గుండుగొలను ఫ్లై ఓవర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళుతోన్న కారును వెనుక నుంచి వస్తున్న టూవీలర్ ఢీకొట్టింది. బైక్‌ను నడుపుతున్న ఏలూరు మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన బొమ్మాళి శంకర్ తలకు తీవ్రగాయమైంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై వైద్య చికిత్స నిమిత్తం శంకర్ ఏలూరు వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: గుండుగొలను గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.4550, రెండు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.